క్లుప్తంగా

నేడు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం


వార్షికోత్సవానికి ముస్తాబైన అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం : మండలంలో సైతారుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుదలంకరణలు ఏర్పాటు చేసి, వీధులు అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో భారీగా అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఉత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


శ్రీలక్ష్మి, పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.పి.ఎస్. శ్రీలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె శనివారం విలేకరులకు తెలిపారు. 2023-24 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీలకు సంబంధించి రూ.150 ఫీజుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మారిన వాతావరణం

రాంబిల్లి: మండుటెండలతో అల్లాడిన ప్రజలు శనివారం మారిన వాతావరణంతో కాస్త ఊరట పొందారు. మధ్యాహ్నం వరకు ఎండ ప్రభావం చూపించింది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై వాతావరణ చల్లబడింది. పది రోజులుగా ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

మునగపాక : సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనిల్‌కుమార్ కోరారు. మండలంలోని నాగవరంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవిలో బయటకు వెళ్లేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దాసరి అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మునగపాక : మునగపాక నందీశ్వర తులసీ కళా వేదిక వద్ద ఈ నెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ వ్యాపారి ఆడారి దానకర్ణ జన్మదిన సందర్భంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. విశాఖ మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య సేవలకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరానికి వైద్యులు కృష్ణతేజ, లావణ్య, చిన్నికృష్ణ తదితరులు సేవలందిస్తారన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు


కట్టుబోలు సమీపంలో యంత్రసాయంతో వరి నూర్పు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరి నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నూర్పు పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ఖరీఫ్ నూర్పులతో పాటు రబీ నూర్పులు దాదాపు ఈ వారంలో పూర్తి కానున్నాయి. నూర్పులు పూర్తి చేసిన రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ప్రయివేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వరి కోత, నూర్పు పనులకు యంత్రాలను వినియోగించారు.

పల్లెల్లో 'జల్'ధారలు

- రూ.20 కోట్లతో 42 గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు
- ఆరు గ్రామాల్లో పూర్తయిన జేజేఎం పనులు


దార్లపూడిలో నిర్మాణం చివరి దశలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు


వమ్మవరంలో రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు (ఫైల్)

ఎస్.రాయవరం : జల్ జీవన్ మిషన్ (జేజేఎం) నిధులతో మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. మండలంలో సుమారు రూ.20 కోట్ల నిధులు కేటాయించి, 42 గ్రామాల్లో పైపులైన్లు ఏర్పాటు, అవసరమైన గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో ఈ పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రామాల్లో 50 శాతం పనులు పూర్తయ్యి తదుపరి పనులు నిర్మాణ దశలో ఉన్నాయని చెబుతున్నారు. దశాబ్దాల కాలంగా కొన్ని గ్రామాలు కొరుప్రోలు, రేవుపోలవరం, కొత్తరేవు పోలవరం, గుర్రాజుపేట, పెద ఉప్పలం, తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, బంగారమ్మపాలెం, సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో తాగునీరు లేక పొరుగు గ్రామాల నుంచి సరఫరా అవుతూ ఉంది. ఇలాంటి గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి వేసి తాగునీటి సమస్య పరిష్కరిద్దామంటే సాధ్యం కాని పరిస్థితి. జల్ జీవన్ మిషన్‌లో విడుదలైన భారీ నిధులతో గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన ప్రతి ఇంటికి తాగునీరందివ్వాలనే ఉద్దేశంతో ఉచిత కుళాయి ఏర్పాటు చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం కూడా నిర్మాణం చేశారు. కొన్ని రూ.లక్షల్లో కేటాయిస్తే మరి కొన్ని గ్రామాల్లో రూ.కోట్లలో నిధులు కేటాయించారు. ఈ పనులు మరో అయిదారు నెలల్లో పూర్తయ్యి వాడకంలోనికి వస్తే పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. భీమవరం, దార్లపూడి, వమ్మవరం, ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, కర్రివానిపాలెం, పెనుగొల్లు, పి.ధర్మవరం గ్రామాల్లో అదే గ్రామంలో పంపుసెట్లు అదనంగా వేసి తాగునీరు సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చినఉప్పలం, గుర్రాజుపేట, చెల్లాపురం, విశ్వనాథపురం, పెనుగొల్లు, పి.ధర్మవరం గ్రామాల్లో జేజేఎం పనులు పూర్తయ్యాయి. నక్కపల్లి మండలం ఉద్దండపురం ప్రాజెక్టు నుంచి గ్రామాలకు సరఫరా అయ్యే పైపులైను పనులు పూర్తయితే దాదాపు అన్ని గ్రామాల దాహం కేకలు తీరినట్టే.

శరవేగంగా రెండో విడత పనులు



తాగునీటి సమస్య పరిష్కారానికి విడుదలైన భారీ నిధులతో మండలంలో 100 శాతం తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. జేజేఎం పథకం కింద విడుదలైన నిధులతో రెండో విడత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి విడత పనులు డిసెంబర్ నాటికి, రెండో విడత పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి కావాల్సి ఉంది. గ్రామాల్లో చేపడుతున్న రక్షిత నీటి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– ఆర్.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఎస్.రాయవరం మండలం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.కోటి 10 లక్షలకు పైగా నిధులు విడుదలయ్యాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. శివారు గ్రామం సోమిదేవపల్లిలో పూర్తి కావాల్సి ఉంది. వరాహనది సమీపంలో ఉండడం వల్ల స్థానికంగా పంపుసెట్టు ఏర్పాటు చేస్తే తాగునీరు సరఫరా అవుతుంది. ఈ పనులు పూర్తయితే గ్రామానికి తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది.

– ఉద్దడం నాగశ్రీదేవి, సర్పంచ్, పెనుగొల్లు

నేవీ నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి


రాంబిల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

రాంబిల్లి: నేవీ నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి. దేముడునాయుడు డిమాండ్ చేశారు. నేవీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ-2 కంపెనీ ఒక్కసారిగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా 28 డ్రైవర్లను విధుల నుంచి తొలగించడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాంబిల్లిలో బాధిత డ్రైవర్లతో కలిసి దేముడునాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐ దీనబంధును కలిసి డ్రైవర్లకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. న్యాయం జరగకపోతే ఆందోళన బాట పడతామన్నారు.

కర్ణాటకలో కాంగ్రెసు గెలుపు పై హర్షం


కర్ణాటకలో కాంగ్రెసు గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెసు నాయకులు

పాయకరావుపేట : కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ అధికారంలోనికి రావడం ఎంతో శుభపరిణామమని పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో గల కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ గెలుపు (విజయం) బి.జె.పి. పతనానికి నాంది అని అన్నారు. ఏఐసీసీ ఉపనేత రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రను ప్రజలు స్వాగతించారన్నారు. కేంద్రంలో కూడా బీజేపీని గద్దె దింపే రోజులు దగ్గర్లోనే వున్నాయన్నారు. అనంతరం పార్టీ అభిమానులకు స్వీట్లు పంచారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


ఇంటింటా ధర్మ ప్రచారం స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారంలో భాగంగా స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ధర్మ ప్రచారం ద్వారా హిందువుల్లో మంచి చైతన్యం వస్తుందన్నారు. ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, జిల్లా సభ్యుడు రమణ, మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు,ఆడారి ఉమాశంకర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1244 కేసుల పరిష్కారం

కక్షిదారులకు రూ.93.90 లక్షలు చెల్లింపు

యలమంచిలి : జాతీయ లోక్ అదాలత్‌లో భాగం శనివారం యలమంచిలి కోర్టు సముదాయంలో 1244 కేసులు పరిష్కారమైనట్టు యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.వి. విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యలమంచిలి కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌లో 1244 కేసులు పరిష్కరించగా, రాజీ పడిన కేసుల్లో 93లక్షల 90వేల మూడు రూపాయలు కక్షిదారులకు చెల్లించినట్టు తెలిపారు. రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామానికి చెందిన ఎం.పేరయ్య తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం నిమిత్తం 2019లో కోర్టులో దరఖాస్తు చేసుకోగా కోర్టు ఆదేశాల మేరకు దానిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి కొత్త పాసుపుస్తకం లోక్‌అదాలత్‌లో జారీ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతికి ఏర్పాట్లు


నక్కపల్లిలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం

నక్కపల్లి : నక్కపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న అభయాంజ నేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, మన్యుసూక్త సహిత అభిషేకం జరుగుతాయి. అనంతరం సహస్ర నామ సింధూర నాగవల్లి దళ పుష్పార్చన, అనంతరం హోమం నీరాజన మంత్ర పుష్ప కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

రాంబిల్లి : హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దిమిలిలో శారద నది సమీపంలో గల ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నేడు లాంగ్ వాక్

అనకాపల్లిటౌన్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 5గంటల నుంచి లాంగ్‌వాక్ నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ తెలిపారు. నెహ్రూచౌక్ నుంచి మండలంలో కొత్తూరు పంచాయతీ ఎర్రచెరువు వరకు, తిరిగి నెహ్రూచౌక్ మీదుగా పట్టణంలో జార్జిక్లబ్ వరకూ లాంగ్ వాక్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 8గంటలకు జార్జిక్లబ్ ఆవరణలో వివిధ రకాల వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సీనియర్ వైద్యుడు డి.డి.నాయుడు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

కొడుకు కడసారి చూపునకూ నోచుకోలేదు..


- విషాదం నింపిన రోడ్డు ప్రమాదం
- ఛిన్నాభిన్నమైన పాస్టర్ కుటుంబం
- కాళ్లు చేతులు విరిగి కుటుంబం అంతా ఆస్పత్రిపాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్, భారతి


కిరణ్ కుమార్తె శృతి

నక్కపల్లి : నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో కుటుంబం అంతా తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయింది. వీరిలో ఆరేళ్ల కుమారుడు చికిత్స పొందుతూ మరణించగా మిగిలిన వారు కాళ్లు చేతులు విరిగిపోయి ఆస్పత్రిలో మంచాన పడ్డారు. కన్నకొడుకు చివరి చూపునకు కూడా నోచుకోలేని ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. దీనికి తోడు వైద్య ఖర్చులకు ఆర్థిక స్థోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదరు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే నక్కపల్లికి, సారిపల్లిపాలేనికి మధ్య ఈనెల 10తేదీన ఐషర్ వ్యాన్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటో వెనుక బైక్‌పై వెళ్తున్న నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు, పాస్టర్ అయిన పెదపాటి కిరణ్ కుటుంబం తీవ్రగాయాలపాలైన విషయం విదితమే. ఈ ఘటనలో కిరణ్ ఆరేళ్ల కుమారుడు సుధీర్ లాజర్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 11వ తేదీన మరణించాడు. కిరణ్‌కు కాలు విరిగిపోయింది. అతని భార్య భారతికి రెండు చేతులు, కాలు విరిగిపోయింది. కుమార్తె శ్రుతికి కూడా కాలు విరిగిపోయింది. వీరంతా సిమెంట్ కట్లతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుమారుడు లాజర్ కడసారి చూపునకు కూడా తల్లిదండ్రులు నోచుకోలేదు. ఎస్సీ కాలనీలో చిన్నపెంకుటింట్లో నివసిస్తూ చిన్నపాటి వైద్య సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కిరణ్ కుటుంబం విధి వక్రించి ప్రమాదం బారిన పడడంతో ఆదాయం లేక మందులు కొనుగోలుకూ స్థోమత లేక ఇబ్బంది పడుతున్నట్టు స్నేహితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన


భక్తిగీతాలు ఆలపిస్తున్న విష్ణుమూర్తి, గాయని, గాయకులు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేంకటేశ్వరస్వామి భక్తిగీతాల ఆలాపన భక్తులను ఆకట్టుకుంది. ఏడుకొండలవాడిపై గాయనీ గాయకులు పలు భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రధాన వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్షుడు మద్దాల కూర్మారావు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు గౌరీపరమేశ్వరులకు అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, సాయంత్రం 6 గంటల నుంచి గౌరీపరమేశ్వరుల కల్యాణ వేడుకలు జరుగుతాయని ఆయన తెలిపారు.

14 నుంచి మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడి గ్రామంలో సోహన్ ఆశ్రమంలో లోక కల్యాణార్థం ఈనెల 14 నుంచి 90 రోజుల పాటు మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు రవి శనివారం తెలిపారు. ప్రతి రోజూ 12 గంటల పాటు జరిగే ఈ హోమంలో పాల్గొనే భక్తులు ఆవు పేడతో చేసిన పిడకలు, రోజుకు రెండు కిలోల ఆవు నెయ్యి తీసుకుని రావాలని ఆయన కోరారు. పూజలో పాల్గొనే భక్తులు 9966908908 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు


ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని వెంకటాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ద్వారా నాలుగేళ్ల కాలంలో అందిన లబ్ధిని వివరిస్తూ మరిన్ని పథకాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు ఆసరా అలాగే విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతులకు రైతు భరోసా తదితర పథకాలు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, సర్పంచ్ సుందరపు తాతాజీ, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయి వజ్రం, వీఆర్వోల సంఘ ప్రతినిధి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు


వెంకటాపురంలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో రూ.46 లక్షల వ్యయంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పలు రకాల సేవలను సచివాలయాల ద్వారా అందించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ సుందరపు తాతాజీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, మాజీ సర్పంచ్ కనకప్పారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు


వమ్మవరం చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రదేశంలో పొక్లెయిన్


ఒకే చోట కుప్పగా వేసిన మట్టి

ఎస్.రాయవరం : అనుమతులు పేరుతో గ్రామంలో మట్టి అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఓ వ్యక్తికి వ్యవసాయ భూములు చదును చేసుకునేందుకు అనుమతి ఇచ్చారని చెప్పి, చెరువులో మట్టి కొంత విక్రయించుకుని మరికొంత స్టోరేజ్ చేసుకున్నట్టు చెప్పారు. ఇలా జరుగుతున్న సమయంలో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా గ్రామంలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టినట్టు చెప్పారు. అనుమతులు ఉన్నాయని చెబుతూనే రాత్రుళ్లు రహస్యంగా మట్టిని తరలిస్తున్నారని వాపోయారు. ఇదంతా దిగువ స్థాయి ఇరిగేషన్ అధికారులకు తెలిసి జరుగుతున్నాయని విమర్శలు చేస్తున్నారు. అక్రమార్కులు, అధికారులు పగడ్బందీగా మట్టి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ , జగనన్న కాలనీ లబ్ధిదారులకు పునాదులు వేసుకోవడానికి తొట్టి మట్టి కూడా దొరకడం లేదని వాపోతున్నారు. అధికారుల వద్దకు జగనన్న కాలనీ దారులు పదే పదే తిరిగినా ఫలితం లేదని చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాదారులను కట్టడి చేసి జగనన్న కాలనీ లబ్ధిదారులకు అవసరమయిన మట్టి తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయపై యలమంచిలి డీఈ సుజాతను వివరణ కోరగా జిల్లా అధికారుల నుంచి అనుమతులు తీసుకుని తవ్వకాలు చేపట్టడం వాస్తవమేనని, ఆ మట్టి అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్టు ఫిర్యాదు వచ్చిందని, వెంటనే మట్టి తవ్వకాలు నిలుపుదల చేశామన్నారు. విచారణ చేపట్టి మట్టి అక్రమ మార్గాల్లో తరలించినట్టు తేలితే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు

కొక్కిరాపల్లిలో ఉచిత వైద్య శిబిరం


వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

యలమంచిలి : ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ రవిశంకర్ గురూజీ 67వ జన్మదిన వేడుకలు శనివారం కొక్కిరాపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక యోగ గురువు పండిత్ శ్రీరవిశంకర్ గురూజీ జన్మదినం సందర్భంగా కొక్కిరాపల్లి రామాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ రవిశంకర్ గురూజీ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం గ్రామంలో వృద్ధులు, విద్యార్థులు పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పాలరౌతు నర్సింగరావు మాట్లాడుతూ రవిశంకర్ గురూజీ సమాజంలో యువతీ యువకుల్లో మార్పు తీసుకురావడానికి యోగా, ధ్యానం గురించి చెబుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండే విధంగా సత్ప్రవర్తనతో యువత మెలగేలా కృషి చేస్తున్నారని అన్నారు. గొర్లె వెంకట్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించి యువకుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్న వయస్సులోనే మద్యానికి విద్యార్థులు బానిసలు అవుతున్నారని యోగా, ధ్యానం ద్వారా చెడు మార్గాలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లలను సన్మార్గంలో ఉండేటట్టు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆడారి గంగాధర్, గొర్లె నానాజీ, గొర్లె వరలక్ష్మి, పాముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్‌అయిన విద్యార్థినీవిద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌ల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆయన చెప్పారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తుతో పాటు పదోతరగతి మార్కుల మెమో, టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జెరాక్స్ కాపీలు, తల్లి బ్యాంక్ అకౌంట్ నంబర్ జెరాక్స్ కాపీ అందజేయాలని ఆయన కోరారు.